# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. వికసిత్ భారత్‌కు కేంద్ర బడ్జెట్ పునాది వేస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2. ఆంధ్ర ప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఉద్ఘాటించారు.**

**3. రాష్ట్రంలో ఖరీఫ్ పంటల సాగుకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

**4. జాతీయ విద్యావిధానం లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర విద్యాశాఖ శిక్ష సప్తాహ్ పేరుతో ఈరోజు నుంచి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.**

**5. భారత జాతీయ జెండా, త్రివర్ణ పతాకాన్ని రాజ్యాంగ సభ ఆమోదించి నేటితో 77 సంవత్సరాలు పూర్తయ్యాయి.**

==========================

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభమయ్యాయి.ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలపై గణాంక సమాచార విశ్లేషణను తెలిపే ఆర్థిక సర్వే 2023-24 పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. రేపు 2024-25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైన మూడోసారి ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్ ఇది. మరోవైపు పార్లమెంట్ సమావేశాలకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడారు. వికసిత్ భారత్‌కు కేంద్ర బడ్జెట్ పునాది వేస్తుందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి పార్లమెంట్ వేదికగా అర్థవంతమైన చర్చలు జరగాలన్నారు, ఈసారి ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ అత్యంత కీలకమైందని తెలిపారు. వచ్చే ఐదేళ్లకు కేంద్ర ప్రభుత్వానికి కార్యనిర్దేశం చేసేదిగా ఈ బడ్జెట్ ఉంటుందని పేర్కొంటూ,

వాయిస్ (35 సెకన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఉద్ఘాటించారు. ఈరోజు శాసన సభ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ సమ్మిళిత అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విభజనతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆస్తులు, అప్పుల పంపిణీలో అసమానతలు వున్నాయని, ఆర్థిక లోటు కొనసాగుతోందని చెప్పారు. ఎటువంటి ఆధారాలు లేకుండా విద్యా సంస్థలను విభజించారని, ఫలితంగా ఉన్నత విద్యా సంస్థలను

కోల్పోయామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత శాసన సభ్యులపై వుందని గవర్నర్ పేర్కొంటూ

వాయిస్ (28 సెకన్లు )

రాష్ట్ర శాసన సభ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ సభ్యులను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఆటంకం కలిగించారు. ఆ పార్టీకి చెందిన సభ్యులు నల్ల కండువాలు కప్పుకుని నిరసన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగిస్తున్నంత సేపు వారు నినాదాలు చేశారు. గవర్నర్ ప్రసంగం మధ్యలోనే వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు సభ నుండి వెళ్లిపోయారు. ఇలా ఉండగా, గవర్నర్ ప్రసంగం అనంతరం సభను రేపటికి వాయిదా వేశారు.

---------------------------

రాష్ట్రంలో ఖరీఫ్ పంటల సాగుకు సంబందించి పూర్తిస్థాయిలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాలకు ముందు గుంటూరు జిల్లా వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో 50 శాతానికి పైగా వర్షపాతం నమోదైందన్నారు. ఉపాధి హామీ పనుల్లో పంట కాలువల్లో పూడిక తీసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పంట పొలాల్లో నీటి నిల్వ తొలగింపు, తేమ ద్వారా ఆశించే తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు చేస్తున్నామన్నారు. చెరువులు, ప్రాజెక్టుల్లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఖరీఫ్ సాగు కోసం 17.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

---------------------------

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఘటనపై అత్యవసర విచారణకు ఆదేశించారు. ఘటనాస్థలిలో విచారణ చేపట్టాలని డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆదేశాలు జారీ చేశారు. అగ్నిప్రమాదంలో పలు దస్త్రాలు దగ్ధమైనట్లు ప్రాథమిక సమాచారం అందిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో సీసీ ఫుటేజ్ సహా సమస్త వివరాలతో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పొన్నూరు నియోజకవర్గంలో నిర్మించనున్న రహదారికి స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, 5.20 కోట్ల రూపాయల నిధులతో కట్టెంపూడి, దండమూడి మీదుగా మామిళ్ళపల్లి వరకు 6.7 కి.మీ.ల మేర రహదారిని నిర్మించనున్నామని చెప్పారు. ఇళ్ళు, డ్రైనేజీ వంటి సమస్యలపై తొలి దశలో దృష్టి సారిస్తున్నామని వివరించారు. కేంద్ర మంత్రిగా ఢిల్లీలో ఉన్నప్పటికీ, నియోజకవర్గంలోనూ వారానికి రెండు రోజులు పర్యటిస్తానని తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన జాతీయ విద్యావిధానం లక్ష్యాలను మరింత విస్తృతం చేసేందుకు శిక్షా సప్తాహ్–విద్యా వారం పేరుతో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించనుంది.

నూతన జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమాలు ఈరోజు నుంచి ఈ నెల 29 వరకు వారంరోజులపాటు నిర్వహించనుంది. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటలు ఆడించడంతో పాటు, విజ్ఞానాన్ని పెంచేలా విద్యాశాఖ అధికారులు కార్యాచరణను రూపొందించారు. రోజూ ఒక్కో పేరుతో ఒకటి నుంచి రెండో తరగతి వరకు, మూడు నుంచి ఐదు, ఆరు నుంచి పదో తరగతి వరకు వేర్వేరుగా కార్యక్రమాన్ని అమలు చేస్తారు.

---

శాసనసభ్యుల కోటాలో ఇటీవల నూతనంగా ఎన్నికైన శాసనమండలి సభ్యులు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. వెలగపూడిలోని రాష్ట్ర శాసనసభ కార్యాలయంలో సి. రామచంద్రయ్య, పిడుగు హరి ప్రసాద్‌లతో శాసన పరిషత్తు చైర్మన్ కొయ్యే మోషేను రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారికి అభినందనలు తెలుపుతూ, శాసన పరిషత్తు నియమ నిబంధనల పుస్తకాలను చైర్మన్ అందజేశారు.

---

ప్రజల నుంచి స్వీకరించిన వినతులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ప్రజల నుంచి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలపై వినతులను అందించారని..వారి సమస్యలను ఆయా శాఖ అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

---

భారత జాతీయ జెండా, త్రివర్ణ పతాకాన్ని రాజ్యాంగ సభ ఆమోదించి నేటితో 77 సంవత్సరాలు పూర్తయ్యాయి. పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని 1947 జూలై 22వ తేదీన భారత రాజ్యాంగ సభ ఆమోదించింది. భరతజాతి స్వాభిమానానికి, స్వాతంత్ర్య దీప్తికి, సమైక్యతా స్ఫూర్తికి అద్దంపట్టే మువ్వన్నెల జెండాను ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా భట్లపెనుమర్రులో జన్మించిన పింగళి వెంకయ్య రూపొందించటం తెలుగువారికి ఎంతో గర్వకారణం. కాషాయ, తెలుపు, ఆకుపచ్చ వర్ణాలతో మధ్యలో అశోకచక్రం, 24 పత్రాలతో రూపొందిన జాతీయ పతాకం సర్వసత్తాక భారతదేశ సర్వతోముఖాభివృద్ధికి సంకేతంగా అలరారుతోంది.

---

ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన తుది విడత కౌన్సెలింగ్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు బి.నవ్య నిన్న నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. రేపటి నుంచి ఈ నెల 25వ తేదీ లోపు ఆన్‌లైన్ నమోదు, రుసుము చెల్లింపు ప్రక్రియలను అభ్యర్థులు పూర్తి చేయాలని తెలిపారు. తర్వాత ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఐచ్ఛికాలను నమోదు చేసుకోవాలని సూచించారు. 30న కళాశాల్లో ప్రవేశాల కేటాయింపు పూర్తవుతుందని తెలిపారు.

--------------------------

ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరద ప్రభావం కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద ప్రవాహం పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 10 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వరద ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉండటంతో లంక గ్రామాలలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలోనూ వర్షాల ప్రభావం అధికంగా ఉంది. తెలంగాణలో కురుస్తున్న వానలతో పులిచింతల, ప్రకాశం బ్యారేజీలో నీటిమట్టం పెరుగుతోంది.

======================